నేటి నుంచి టీజీబీ సేవలు బంద్

ఉట్నూర్, డిసెంబర్27: నేటి నుంచి నాలుగు రోజులపాటు తెలంగాణ దక్కణ్ గ్రామీణ బ్యాంక్ సేవలు నిలిచిపోనున్నాయని హస్నాపూర్ మేనేజర్ రాజు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆంధ్ర ప్రదేశ్ చెందిన గ్రామీణ వికాస్ బ్యాంకు తెలంగాణలోని శాఖలు దక్కణ్ గ్రామీణ బ్యాంక్‌లో విలీనం కానున్న నేపథ్యంలో ఈ నెల 31వరకు బ్యాంక్ సేవలు, యూపీఐ, ఏటీఎం, మొబైల్ బ్యాంకింగ్, ఇంటర్నెట్ బ్యాంకింగ్, సీఎస్‌పీ సెంటర్లు పూర్తిగా పని చేయవని తెలిపారు. జనవరి ఒకటో తేదీన నుంచి యథావిధిగా పని చేస్తాయని, ఖాతాదారులు గమనించి సహకరించాలన్నారు.

దస్తురాబాద్, డిసెంబర్ 27: ఆంధ్ర ప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ వికాస్ బ్యాంక్ (ఏపీజీవీబీ) అన్ని శాఖలు తెలంగాణ గ్రామీణ బ్యాంక్‌లో విలీనం కానున్న నేపథ్యంలో ఈ నెల 28 నుంచి 31 వరకు బ్యాంక్ సేవలు పని చేయవని టీజీబీ మేనేజర్ నరేశ్ పేర్కొన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడారు. జనవరి 1వ తేదీ నుంచి బ్యాంక్ సేవలు యథావిధిగా కొనసాగుతాయని ఆయన తెలిపారు.

దుప్పట్లు పంపిణీ

తలమడుగు, డిసెంబర్ 27: సుంకిడి గ్రామంలో శుక్రవారం సాయిలింగి వృద్ధాశ్రమ వ్యవస్థాపకుడు దెబ్బడి అశోక్ ఆధ్వర్యంలో వృద్ధులకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఇక్కడ మాజీ సర్పంచ్ మహేందర్‌యాదవ్, మాజీ ఎంపీటీసీ వెంకట్‌యాదవ్, గ్రామ పెద్దలు ఆశన్న యాదవ్, కుంటాల అశోక్, పసుపుల రాజు, కుంటాల శ్రీకాంత్, తదితరులు ఉన్నారు.

సీఆర్టీల సమస్యలు పరిష్కరించాలి

ఉట్నూర్, డిసెంబర్27: సీఆర్టీల సమస్యలు పరిష్కరించాలని ఆ సంఘం నాయకుడు వంశీ పేర్కొన్నారు. శుక్రవారం ఐటీడీఏ ఎదుట సీఆర్టీల రిలే దీక్షలో ఆయన పాల్గొని, మట్లాడారు. తమ దీక్షతో గిరిజన విద్యార్థులు తీవ్రంగా నష్టపోతున్నారని, వెంటనే సమస్యలు పరిష్కరించాలన్నారు. శనివారం ఐటీడీఏ కేంద్రం ఎదుట వంటావార్పుతో నిరసన చేపట్టనున్నట్లు తెలిపారు.

29న రౌండ్ టేబుల్ సమావేశం

ఎదులాపురం, డిసెంబర్ 27: సీపీఐ జిల్లా కార్యాలయంలో ఈ నెల 29న ఉదయం 10:30 గంటలకు రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించ నున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేశ్ శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అంబేద్కర్‌పై కేంద్ర మంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలకు నిరసనగా ఆయనను మంత్రి పదవి నుంచి తప్పించాలని డిమాండ్ చేస్తూరౌండ్ టేబుల్ సమావేశం ఉటుందన్నారు. సామాజిక, కార్మిక, కర్షక, విద్యార్థి యువజన సంఘాల నాయకులు సమావేశానికి హాజరై, విజయవంతం చేయాలని కోరారు.

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

బోథ్, డిసెంబర్ 27: మెరుగైన విద్యుత్ సరఫరా కోసం బోథ్‌లో అదనంగా 5 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయిస్తున్నట్లు ట్రాన్స్‌కో సీఈ జయవంత్ రావ్‌చౌహాన్ తెలిపారు. శుక్రవారం బోథ్‌లోని 33/11కేవీ సబ్‌స్టేషన్‌ను ఆయన సందర్శించారు. అదనపు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు కోసం చేస్తున్న గద్దె పనులను పరిశీలించారు. రైతులు మోటర్ల వద్ద కెపాసిటర్లు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సీఈ వెంట ఎంమార్టీ డీఈ ప్రభాకర్, ఏడీఈ లక్ష్మణ్, ఎస్ఎల్ఐ ప్రవీణ్, ఎల్ఐ సాన్వా, సిబ్బంది ఉన్నారు.

విలీన సభకు పెద్ద సంఖ్యలో హాజరవ్వాలి

ఖానాపూర్, డిసెంబర్ 27: హైదరాబాద్‌లో శనివారం జరగబోయే న్యూ డెమోక్రసీ విప్లవ పార్టీల విలీన సభకు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని సీపీఐఏం న్యూ డెమోక్రసీ నాయకులు కోరారు. ఈ క్రమంలో శుక్రవారం వారు పట్టణంలోని విశ్రాంతి భవనంలో వాల్‌పోస్టర్లు విడుదల చేశారు. ఇక్కడ ఖానాపూర్ డివిజన్ సీపీఐఏం న్యూడెమోక్రసీ కార్యదర్శి సునారికారి రాజేశ్, నాయకులు రాజేశ్, స్వామి, ప్రసాద్, లింగన్న తదితరులు ఉన్నారు.

డిప్యుటేషన్లు రద్దు చేయాలి

నిర్మల్ చైన్‌గేట్, డిసెంబర్ 27: కేజీబీవీలో డిప్యుటేషన్లు రద్దు చేయాలని ఎమ్మెల్సీ అభ్యర్థి సీపీఎస్ కృష్ణారావు పేర్కొన్నారు. శుక్రవారం ఆయన నిర్మల్‌లో విలేకరులతో మాట్లాడారు. జిల్లా, మండల పరిషత్ పాఠశాలల ఉపాధ్యాయినులకు కేజీబీవీలకు ఇన్‌చార్జి ఎస్‌వోలుగా నియమిస్తూ ఇచ్చిన డిప్యూటేషన్లు రద్దు చేయాలన్నారు ఇలా చేయడం వల్ల ఇటు పాఠశాలల్లో విద్యాబోధనకు ఆటంకం ఏర్పడుతుందని, అటు అనుభవం లేనటువంటి వ్యవస్థలో పనిచేయడం వల్ల ఇబ్బందులు వస్తాయని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే ఈ ఆలోచన విరమించుకోవాలన్నారు.

మెరుగైన వైద్యసేవలందించాలి

- రక్తహీనత లేని సమాజాన్ని నిర్మిద్దాం
- జిల్లా వైద్యాధికారి రాజేందర్
- చించోలి(బి)లో హెచ్‌బీ మాక్‌డ్రిల్ పరీక్షల పరిశీలన

రక్తహీనత పరీక్షలను పరిశీలిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ రాజేందర్

సారంగాపూర్, డిసెంబర్ 27: ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ రాజేందర్ సూచించారు. శుక్రవారం చించోలి(బి)లో నిర్వహించిన హెచ్‌బీ మాక్‌డ్రిల్ పరీక్షలను ఆయన పరిశీలించి, మాట్లాడారు. సమాజంలో రక్తహీనతతో బాధపడుతున్న వారిని గుర్తించి కాపాడాల్సిన బాధ్యత ఆరోగ్యశాఖపై ఉందన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రతి ఒక్కరికి రక్తహీనత పరీక్షలు నిర్వహించేందుకు ప్రణాళికలు చేస్తున్నట్లు తెలిపారు. రక్తహీనత పరికరాలు స్ట్రిప్స్ ఎప్పటికప్పుడు అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. గతంలో గర్భిణులకు మాత్రమే రక్తహీనత పరీక్షలు నిర్వహించే వారమని, కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లాను రక్తహీనత రహితంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఇక్కడ జిల్లా మాస్ మీడియా అధికారి బారే రవీందర్, ఆరోగ్య పర్యవేక్షకులు కృష్ణమోహన్‌గౌడ్, మొహిన్‌అలీ, సిబ్బంది, తదితరులు ఉన్నారు.

విజయవంతం చేయాలి

ఇంద్రవెల్లి, డిసెంబర్27: అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జనవరి1న నిర్వహించే 206వ భీమా కోరేగావ్ విజయోత్సవ శౌర్య దివస్‌ను విజయవంతం చేయాలని అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల కమిటీ అధ్యక్షుడు సోన్‌కాంబ్లే మనోహర్ పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయా పార్టీల నేతలతో కలిసి అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల కమిటీ నాయకులు భీమా కోరేగావ్ శౌర్య దివస్ కార్యక్రమానికి చెందిన పోస్టర్లు విడుదల చేశారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని అన్ని మండలాలకు చెందిన బహుజనులు అధిక సంఖ్యలో తరలిచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఇక్కడ పీఏసీసీ చైర్మన్ మారుతిపటేల్ డోంగ్రే, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ముకాడే ఉత్తం, పీఏసీఎస్ మాజీ చైర్మన్ దిలీప్ మోరే, మండల మాజీ కోఆప్షన్ సభ్యులు మిర్జా జిలానీబేగ్, ఎండీ మసుద్, బీం ఆర్మీ ఖానాపూర్ నియోజకవర్గ అధ్యక్షుడు పరత్‌వాగ్ సందీప్, అంబేద్కర్ మెమోరియల్ అసోసియేషన్ మండల కమిటీ ప్రధాన కార్యదర్శి కామ్‌రాజ్ వాగ్మారే, మండల కోశాధికారి సునీల్, నాయకులు మస్కే రాజ్‌వర్ధన్, శివాజీ, జహీర్, దూద్‌రాం, మారుతి, తదితరులు ఉన్నారు.

జయప్రదం చేయాలి

ఎదులాపురం, డిసెంబర్27: ఆదిలాబాద్ పట్టణంలోని భూక్తాపూర్‌లో మహాప్రజ్ఞా బుద్ధవిహార్‌లో జనవరి ఒకటిన నిర్వహించే 206వ బీమాకోరేగావ్ శౌర్య దినోత్సవాన్ని విజయవంతం చేయాలని సమతా సైనిక్‌దళ్ జాతీయ కన్వీనర్ గౌరవ దిగంబర్‌కాంబ్లే పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానిక మహాప్రజ్ఞా బుద్ధ విహార్ సమావేశాన్ని నిర్వహించగా, జాతీయ కన్వీనర్ గౌరవ దిగంబర కాంబ్లే, ఉత్తర తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రత్నజాడే ప్రజ్ఞ కుమార్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ముందుగా గౌతమ బుద్ధుడి, ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహాలు, మహాత్మా జ్యోతిబాపూలే, అంబేద్కర్, సావిత్రీబాయి పూలే చిత్రపటాలకు జ్యోతిప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఇక్కడ మహా ప్రజ్ఞ బుద్ధ విహార్ డెవలప్‌మెంట్ కమిటీ అధ్యక్షుడు రత్నజాడే ఉదయ్‌కుమార్, ఎస్సీ రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ జిల్లా యూత్ అధ్యక్షుడు మస్కే రాజు, ఉపాధ్యక్షుడు పటాడే రాజు, సెక్రటరీ సూకదేవే హరీశ్, ఈశ్వర్, సూకదేవ్ ఉన్నారు.

చైన్ స్నాచింగ్ కలకలం

బాసర, డిసెంబరు 27: మండల కేంద్రం బాసరలో శుక్రవారం చైన్ స్నాచింగ్ ఘటన కలకలంరేపింది. వివరాల ప్రకారం.. కుంటాల మండలం కల్లూర్ గ్రామానికి చెందిన సుశీల తన మనవడి పుట్టువెంట్రుకలను తీయించుకునేందుకు కుటుంబ సభ్యులతో కలిసి బాసరకు వచ్చింది. గోదావరి నది వద్ద పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారి దర్శనం కోసం గోదావరి నది నుంచి ఆలయానికి నడకమార్గాన వెళ్తున్నది. అయితే దర్శనానికి వెళ్లే క్రమంలో గుర్తు తెలియని ఇద్దరు యువకులు బైక్ మీద వచ్చి భక్తురాలి మెడలోని బంగారు గొలుసును ఎత్తుకొని పారిపోయారు. విషయం తెలుసుకున్న ఏఎస్ఐ లక్ష్మణ్ ఘటనా స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

యువకుడి బలవన్మరణం

ఇంద్రవెల్లి, డిసెంబర్27: జీవితంపై విరక్తి చెంది ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన ఏమాయికుంట గ్రామ పంచాయతీ పరిధిలోని న్యూ హీరాపూర్ (రమాయినగర్)లో చోటుచేసుకున్నది. ఏఎస్ఐ భీంరావ్ తెలిపిన వివరాల ప్రకారం.. రమాయినగర్ గ్రామానికి చెందిన మెస్రం నగేశ్ (20) కొంతకాలంగా మానసిక స్థితి బాగలేక బాధపడుతున్నాడు. కుటుంబ సభ్యులు నాటు వైద్యం చేయించినా.. ఆరోగ్యం కుదటపడడం లేదు. ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది గురువారం రాత్రి ఇంట్లో దూలానికి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. నగేశ్ తండ్రి శేకు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ

ఎదులాపురం, డిసెంబర్27: విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని సోషల్ వెల్ఫర్ రెసిడెన్షియల్ బాలికల స్కూల్, కాలేజ్ ప్రిన్సిపాల్ లలితాకుమారి పేర్కొన్నారు. శుక్రవారం రెసిడెన్షియల్‌లో శాంతినగర్ అర్బన్ పీహెచ్‌సీలో వైద్య శిబిరం నిర్వహించారు. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ ఇఫ్షత్ విద్యార్థులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. రక్తన మూనాలు సేకరించి ఇద్దరిని రిమ్స్‌కు రెఫర్ చేశారు. అదే విధంగా ఆరోగ్య పాఠశాలలో భాగంగా క్షయ వ్యా ధిపై అవగాహన కల్పించారు. ఇక్కడ శాంతినగర్ పీహెచ్‌సీ సీవో కేమ రాజారెడ్డి, ఎల్టీ భూమయ్య, ఏఎన్ఎం రుక్మిణి, శ్వేత, హెల్త్ సూపర్ వైజర్ పద్మ, ఆశ కార్యకర్త శీరిష, తదితరులు ఉన్నారు.

లారీ బోల్తా.. తప్పిన ప్రమాదం

బోల్తాడిన లారీ

కుభీర్, డిసెంబర్ 27: మండల కేంద్రంలోని కుభీర్-సోనారి రోడ్డులోని ఎంపీడీవో కార్యాలయ సమీపంలో శుక్రవారం పత్తి గింజల లోడుతో తరలుతున్న లారీ ప్రమాదవశాత్తు అదుపు తప్పి బోల్తా పడింది. ప్రమాదం నుంచి లారీ డ్రైవర్, క్లీనర్ సురక్షితంగా బయటపడ్డారు. నగేశ్ ఇండస్ట్రీస్ నుంచి పత్తి గింజలను హర్యాణ రాష్ట్రానికి లారీలో తరలిస్తుండగా, రోడ్డు గుంతల మయంగా మారడంతో పల్టీ కొట్టింది. మిల్లు యజమాని మరో లారీని రప్పించి గింజల బస్తాలను డంప్ చేయించారు.

నీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్

పట్టణాభివృద్ధికి కృషి

- మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్

నిర్మల్ అర్బన్, డిసెంబర్ 27: నిర్మల్ పట్టణాభివృద్ధికి కృషి చేస్తానని మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్ పేర్కొన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ దవాఖానకు వెళ్లే మార్గంలో ర్యాంప్, సీసీ రోడ్డు పనులను శుక్రవారం పరిశీలించారు. ఇక్కడ కౌన్సిలర్ చాహుస్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుల అరెస్ట్

తాండూర్ (బెల్లంపల్లి), డిసెంబర్ 27 : హత్యయత్నం కేసులో కాగజ్‌నగర్‌కు చెందిన రమేశ్, బల్లార్షాకు చెందిన మహేశ్, సురేశ్ సముద్రాల, ప్రదీప్ ఋషికేశ్ కుమార్‌ను అరెస్ట్ చేసినట్లు రూరల్ సీఐ అష్జలుద్దీన్ తెలిపారు. రూరల్ సీఐ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. పాత పగలను మనస్సులో పెట్టుకొని పామల పురుషోత్తంను చంపేందుకు కాగజ్‌నగర్‌కు చెందిన పాముల శివసాయి, జాడి శ్యామ్‌రావు పథకం వేశారు. ఈ క్రమంలో కాగజ్‌నగర్‌కు చెందిన రమేశ్, బల్లార్షాకు చెందిన మహేశ్, సురేశ్ సముద్రాల, ప్రదీప్ ఋషికేశ్ కుమార్‌కు రూ. 50వేలు సుపారీ ఇచ్చారు. దీంతో ఈ ఐదుగురు ఈ నెల 24న సాయంత్రం కాగజ్‌నగర్ రైల్వేస్టేషన్ వద్ద పాముల పురుషోత్తం కారును రూ.2,700 కిరాయికి మాట్లాడుకున్నారు. కాగజ్‌నగర్ నుంచి మంచిర్యాలకు బయల్దేరారు. ఈ క్రమంలో అందులో ఒకరు బెల్లంపల్లి శ్రీనిధి హోమ్స్ వద్ద దిగుతానని చెప్పగా, బెల్లంపల్లిలోని పంచముఖి హనుమాన్ విగ్రహం వద్ద యూటర్న్ తీసుకున్నారు. కొంత దూరం వెళ్లగా, తిరుమల హిల్స్ దాటగానే మూత్ర విసర్జన కోసం కారు ఆపాలన్నారు. డ్రైవర్ పురుషోత్తం కారు దిగగానే బండరాళ్లతో దాడిచేశారు. సృహ తప్పి పడిపోవడంతో చనిపోయాడని అనుకున్న నిందితులు అతడి వద్ద ఉన్న రూ. 3,500, సెల్‌ఫోన్, కారు తీసుకొని కాగజ్‌నగర్ వైపు వెళ్లిపోయారు. పురుషోత్తం కొడుకు ప్రవీణ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టామని సీఐ తెలిపారు. తాండూర్ మండలం మాదారం 3 ఇంక్లైన్‌కు వెళ్లే అడవి మార్గంలో శుక్రవారం నిందితులు ఉన్నారనే సమాచారం మేరకు వారిని పట్టుకున్నామన్నారు. పాముల శివ సాయి, జాడి శ్యామ్‌రావు, రమేశ్, మహేశ్, సురేశ్ సముద్రాల, ప్రదీప్, ఋషికేశ్‌కుమార్‌ను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. నిందితుల నుంచి కారు, 6 సెల్‌ఫోన్లు, రూ.5 వేలు స్వాధీనం చేసుకున్నామన్నారు. ఈ సమావేశంలో ఎస్ఐలు రమేశ్, మహేందర్, ప్రసాద్ పాల్గొన్నారు. కాగా, నిందితులను చాకచక్యంగా పట్టుకున్న రూరల్ సీఐ అష్జలుద్దీన్, ఎస్ఐలు రమేశ్, మహేందర్, ప్రసాద్, సిబ్బందిని మంచిర్యాల డీసీపీ, బెల్లంపల్లి ఏసీపీ అభినందించారు.

ఎస్సీ వర్గీకరణను అడ్డుకుందాం

పెంచికల్ పేట్, డిసెంబర్ 27 : రాజకీయ లబ్ధి కో సం కేంద్ర ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణకు అవలంభిస్తు న్న తీరును అంబేద్కర్ ఆశయాలతో మాలలమంతా ఐకమత్యంతో అడ్డుకుందామని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పసుల రామ్మూర్తి పిలుపునిచ్చారు. కేంద్రంలో శుక్రవారం అంబేద్కర్ విగ్రహానికి పూ లమాలలు వేసి, నివాళులరిపంచారు. అనంతరం మాల మహానాడు సంఘం ఆధ్వర్యంలో మండల కేంద్రంతో పాటు, కొండపల్లిలో అంబేద్కర్ జెండా మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్నారు. జెండాలను ఆవిష్కరించారు. ఎస్సీ వర్గీకరణ జరిగితే రిజర్వేషన్లు కోల్పోయి, విద్య, ఉద్యోగ అవకాశాలు కోల్పాతామని పేర్కొన్నారు. పార్లమెంట్‌లో అంబేద్కర్‌ను అవమానించి హోం మంత్రి అమిత్ షా అంతు చూ స్తామని హెచ్చరించారు. తప్పు ఒప్పుకొని, అంబేద్కర్‌కు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఇక్కడ రాష్ట్ర అధ్యక్షుడు జూపాక సుధీర్, జాతీయ ఉపాధ్యక్షుడు ముత్తమల పుల్లయ్య, జాతీయ కార్యదర్శి కాసర్ల యాదగిరి, రాష్ట్ర ఉపాధ్యక్షులు సొగల కిష్టయ్య, పురుషోత్తం, రాష్ట్ర కార్యదర్శి మధుబాబు ఉన్నారు.

కడ్తాల్ గ్రామస్తులకు మద్దతుగా..

దీక్షకు సంఘీభావం తెలుపుతున్న సాకెర గ్రామస్తులు

సోన్, డిసెంబర్ 27: కడ్తాల్ ఎన్‌హెచ్ 44పై నిర్మించిన అండర్ బ్రిడ్జి వద్ద గల సర్వీస్ రోడ్డు తమకు కావాలని కోరుతూ కడ్తాల్ గ్రామస్తులు చేస్తున్న రిలే నిరాహార దీక్ష శుక్రవారం నాటికి 18వ రోజుకు చేరుకున్నది. సాకెర మాజీ సర్పంచ్ సుంచు శ్రీనివాస్, సిరిగిరి నవీన్, సిరిగిరి వెంకట్‌నర్సయ్య, న్యారడి శివరాం, ఉదయ్‌కుమార్, రేగుంట సదానంద్ దీక్షకు సంఘీభావం తెలిపారు.

సోన్ మండల కేంద్రంలో వరి నాట్లు వేస్తున్న మహిళా కూలీలు

వరి నాట్లు షురూ

- ముమ్మరంగా వ్యవసాయ పనులు
- బిజీబిజీగా రైతులు

సోన్, డిసెంబర్ 27: మండలంలో వరి నాట్లు ముమ్మరంగా ప్రారంభమయ్యాయి. ఆయా గ్రామాల్లో రైతులు ఇప్పటికే వరి నార్లు పోసుకోగా.. ప్రస్తుతం నాట్లు వేస్తున్నారు. ట్రాక్టర్లతో దమ్ము చేసి వరి నారును మహిళలు నాట్లు వేస్తుండడంతో రైతులు బిజీబిజీగా ఉన్నారు.

ఆటో చోరీ

ఎదులాపురం, డిసెంబర్ 27: ఆదిలాబాద్ వన్ టౌన్ పరిధిలోని పట్టరగట్టి వాగ్జికర్ రాజు ఇంటి వద్ద పార్కింగ్ చేసిన ఆటో దొంగతనమైనట్లు వన్ టౌన్ సీఐ బీ సునీల్ కుమార్ తెలిపారు. ఈ నెల 25న రాజు తన ఇంటి ఎదుట పార్కింగ్ చేసి ఉంచాడు. ఉదయం చూసేసరికి పార్కింగ్ ఆటో కనిపించలేదు. ఎక్కడ వెతికిన ఆటో దొరకకపోవడంతో శుక్రవారం వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సునీల్ కుమార్ తెలిపారు.

దరఖాస్తుల స్వీకరణ

లక్షెట్టిపేట, డిసెంబర్ 27: పట్టణంలోని ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలికల గురుకులంలో బాటనీ, జేఎల్ బోధించేందుకు అతిథి అధ్యాపకుల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రమాకళ్యాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెస్సీ బాటనీ, జువాలజీతో పాటు, బీఈడీ అర్హత కలిగి ఉండాలని పేర్కొన్నారు. మహిళలకు మొదటి ప్రాధాన్యత ఉంటుందని, ఆసక్తి గల అభ్యర్థులు 30లోగా కళాశాలలో హాజరు కావాలని సూచించారు.

కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచాలి

రెబ్బెన, డిసెంబర్ 27 : సింగరేణిలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్టు కార్మికుల వేతనాలు పెంచాలని తెలంగాణ బొగ్గు గనుల కాంట్రాక్టు కార్మికుల సంఘం(బీఆర్ఎస్, టీబీజీకేఎస్ అనుబంధం) బెల్లంపల్లి ఏరియా అధ్యక్షుడు అంబాల ఓదెలు డిమాండ్ చేశారు. బెల్లంపల్లి ఏరియా గోలేటిలోని జీఎం కార్యాలయం ఎదుట శుక్రవారం సాయంత్రం టీబీజీసీకేఎస్ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. అధికారులకు వినతిపత్రం అందించిన అనంతరం మాట్లాడారు. జీవో నంబర్ 22 అమలు చేసి, కనీస వేతనాలు పెంచి చెల్లించాలని, బెల్ట్ క్లీనింగ్, బ్లాస్టింగ్ కార్మికులకు సెమీ స్కిల్డ్ వేతనాలు అమలు చేయాలని, నర్సరీ కార్మికులను సింగరేణి కాంట్రాక్టు కార్మికులుగా గుర్తించి కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రైవేట్ సెక్యూరిటీ గార్డు పనిస్థలాల్లో తగిన రక్షణ కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టు కార్మికులున్నారు.

సర్దార్‌బస్తీకి తాగునీరు అందించాలి

కాగజ్‌నగర్, డిసెంబర్ 27 : కాగజ్‌నగర్ పట్టణంలోని సర్దార్‌బస్తీకి సిర్పూర్ పేపర్ మిల్లు యాజమాన్యం తాగునీరు అందించాలని సీపీఎం పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు కోట శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. విద్య, వైద్యం, తాగునీరు అందించాల్సిన కనీస బాధ్యత మిల్లు యాజమాన్యంపై ఉననదని పేర్కొన్నారు. సమయపాలన లేకుండా తాగునీరు సరఫరా చేస్తుండడంతో కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారని, ఉదయం 5 నుంచి సాయంత్రం 10 గంటల వరకు తాగునీరు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. లేకపోతే మిల్లు గేటు ఎదుట ఆందోళన చేస్తామని హెచ్చరించారు.

31 నుంచి కొనుగోళ్లు ప్రారంభం

జైనథ్/బేల, డిసెంబర్ 27: జైనథ్, బేల మార్కెట్ పరిధిలోని బేల మార్కెట్ ఆవరణలో ఈ నెల 31 నుంచి సీసీఐ ద్వారా పత్తి కొనుగోలు ప్రారంభంకానున్నట్లు మార్కెట్ కార్యదర్శి కాంబ్లే మధుకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పత్తి మొక్క నాణ్యత ప్రమాణాలు తగ్గినందున బీబీ ఎంవోడీ నుంచి బీబీ స్పెషల్‌కు మారిందన్నారు. 8 శాతం తేమ శాతం ఉన్న పత్తి క్వింటాల్‌కు రూ.7,471కి సీసీఐ చెల్లిస్తుందని తెలిపారు. రైతులు ఈ విషయాన్ని గమనించాలన్నారు. అలాగే వాతావరణ మార్పుల కారణంగా సీసీఐ ఆధ్వర్యంలో చేపడుతున్న పత్తి కొనుగోళ్లను ఈ నెల 28న నిలిపివేస్తున్నట్లు సీసీఐ సీపీవో సుధీర్ పేర్కొన్నారు. తిరిగి ఈనెల 31న కొనుగోళ్ల ప్రక్రియను ప్రారంభిస్తామని, రైతులు ఈ విషయాన్ని గమనించి సూచించారు.

అంత్యక్రియల్లో పాల్గొన్న మాజీ మంత్రి

దేవమ్మ అంత్యక్రియల్లో పాల్గొన్న మాజీ మంత్రి జోగు రామన్న

జైనథ్, డిసెంబర్ 27: దీపాయిగూడకు కలమడుగు దేవమ్మ శుక్రవారం మృతి చెందగా, విషయం తెలుసుకున్న మాజీ మంత్రి జోగు రామన్న అంత్యక్రియల్లో పాల్గొన్నారు. బాధిత కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కుటుంబ సభ్యులు మనోధైర్యంతో ఉండాలని భగవంతుడిని వేడుకున్నారు. అంత్యక్రియల్లో ఆదిలాబాద్ ఏఎంసీ మాజీ చైర్మన్ మెట్టు ప్రహ్లాద్, మాజీ సర్పంచ్ బొల్లి గంగన్న, తదితరులు ఉన్నారు.

కోలం హాస్టల్‌లో వైద్య శిబిరం

ఎదులాపురం, డిసెంబర్27: ఆదిలాబాద్ రూరల్ మండలం అంకొలి దవాఖాన పరిధిలోని కోలం ఆశ్రమ ఉన్నత బాలుర పాఠశాలలో శుక్రవారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. అంకొలి పీహెచ్‌సీ డా సర్ఫరాజ్ విద్యార్థులకు రక్తపరీక్షలు చేసి మందులు, మాత్రలు అందించారు. అలాగే వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఇక్కడ హెల్త్ సూపర్‌వైజార్ ఆడే సురేశ్,హెల్త్ అసిస్టెంట్ పవర్ ప్రేమసింగ్, ముయ్యాల మోతి ఉన్నారు.

కమిటీలు ఏర్పాటు చేసుకోవాలి

ఎదులాపురం, డిసెంబర్ 27: కాలనీలో దొంగతనాల నివారణకు స్వచ్ఛందంగా కమిటీలు ఏర్పాటు చేసుకోవాలని మావల ఎస్ఐ వంగ విష్ణువర్ధన్ సూచించారు. పండుగలు, ఫంక్షన్‌లకు ఇతర ప్రాంతాలకు వెళ్తున్నవారు దొంగతనాలు జరగకుండా తీసుకోవాల్సిన జగ్రత్తలపై శుక్రవారం మావల పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యంలో న్యూహౌసింగ్ బోర్డు కాలనీవాసులకు అవగాహన కల్పించారు. ఎవరైనా అనుమానితులు కనిపిస్తే డయల్ 100 లేదా స్థానిక పోలీస్ స్టేషన్ నంబర్‌కు (8712659925) కాల్ చేసి సమాచారం ఇవ్వాలన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

నిర్మల్ చైన్‌గేట్, డిసెంబర్ 27: నిర్మల్ పట్టణంలోని నాయుడు వాడకు చెందిన వంశీకృష్ణ ఈ నెల 24 న నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడగా.. గురువారం రాత్రి చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల మేరకు.. వంశీకృష్ణ పట్టణంలోని ఓ నర్సింగ్‌హోమ్‌లో పార్ట్‌నర్‌గా ఉన్నాడు. ఇందు కోసం రూ.4.50లక్షలు పెట్టుబడి పెట్టాడు. పార్ట్‌నర్ల మధ్య గొడవలు రావడంతో జీవితంపై విరక్తి చెంది ఈ నెల 24 న నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి ప్రభుత్వ దవాఖానకు తరలించగా, నిజామాబాద్ దవాఖానలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ప్రవీణ్ తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ